క్లుప్తంగా

కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి రచన

బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం పీహెచ్‌సీ ఆవరణలో బుధవారం ఆర్‌ఎల్ జాలప్ప ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 14 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ హెచ్‌ఎంపీఎస్ వైరస్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రచన, హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, ఆరోగ్యసిబ్బంది శ్రీదేవి, మమత, ఆషా, శాంతమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు బహుమతులు

పుంగనూరు: స్థానిక ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న సిబ్బందికి నగదు బహుమతులను బుధవారం డిపో మేనేజర్ సుధాకరయ్య అందజేశారు. ఇంధన పొదుపు, ఉత్తమ సేవలకుగాను డ్రైవర్లు బాషా, అన్వర్, రెడ్డెప్ప, దామోదర్‌కు నగదు బహుమతులు అందజేసి అభినందించారు.

మృతుడి కుటుంబానికి అండగా వైఎస్సార్‌సీపీ



బషీర్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రొంపిచెర్ల: అనారోగ్యంతో మృతిచెందిన బషీర్ కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్ద మసీదు వీధికి చెందిన బషీర్ మృతదేహానికి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి కష్టకాలంలో వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బషీర్ కుటుంబం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రాజకీయంగా అండగా ఉండేదన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ డాక్టర్ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మహబుబ్‌బాషా, అల్లాబక్ష్, ఖలీల్‌బాషా, బుడ్డాన్‌సాహెబ్, రాజాసాహెబ్, టి.కాలేషా, గౌస్‌పీర్, నిజాంవుద్దీన్ ఉన్నారు.

రాజనాలబండలో వైకుంఠ ఏకాదశి

చౌడేపల్లె: సత్య ప్రమాణాలకు నిలయమైన రాజనాలబండ ఆలయం వద్ద ఈనెల 10న శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 గంటల దాకా ఆలయంలో సర్వదర్శనం సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందిస్తున్న దాత

పలమనేరు: పట్టణంలోని జెడ్పీ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు గ్రేడ్స్ స్వచ్ఛందసేవా సంస్థ నిర్వాహకులు శేషాద్రి వాలీబాల్, నెట్‌లను బుధవారం అందజేశారు. దాతకు పీఈటీ శాజియా, టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు.

లక్షల్లో పలికే మైలేరు పందెం ఎద్దు



పందెం ఎద్దు ధర రూ.2 లక్షల నుంచి రూ.10 లక్షలకుపైగా..

పోటీలు జరిగే చోట కిక్కిరిసిన జనం మధ్య అల్లిని(నిర్దేశిత ప్రదేశాన్ని) ముందుగా ఎద్దుకు చూపెడతారు. అనంతరం ఒకే ఎద్దును మూడుసార్లు పరిగెత్తిస్తారు. ఈ మూడు దఫాల్లో సరాసరి తక్కువ సెకన్లలో గమ్యం చేరిన ఎద్దు విజేతగా నిలుస్తుంది. ఒక్కో మైలేరులో 500 నుంచి 1000 దాకా ఎద్దులు పాల్గొంటాయి. ఇందులో పాల్గొనే ఎద్దుకు ప్రవేశ రుసుముగా రూ.500 నుంచి రూ.1000 చెల్లించి అట్ట తీసుకోవాలి. తక్కువ సెకన్లలో నిర్దేశిత ప్రదేశానికి వెళ్లే ఎద్దు మొదటి బహుమతిని కైవసం చేసుకున్నట్టే. మైలేర్లలో గెలుపొందిన ఎద్దు ధర అమాంతం పెరుగుతుంది. వీటిని లక్షలు పెట్టి కొనేందుకు ఆసక్తి గల వారు ముందుకొస్తారు. పలమనేరు ప్రాంతంలోనే రూ.లక్ష నుంచి రూ.పది లక్షలకుపైగా వీటి ధరలు పలుకుతున్నాయి.

మొదలైన మైలేర్ల సందడి!

- సరిహద్దు రాష్ట్రాల్లో మైలేర్లకు భలే క్రేజ్
- మొదటి బహుమతిగా లారీలు, కార్లు
- పోటీలకు ఎద్దులను సిద్ధం చేస్తున్న నిర్వాహకులు
- పోటీలో గెలిచిన ఎద్దు ధర లక్షల్లోనే



పలమనేరు ప్రాంతంలో నిర్వహించే మైలేరు(ఫైల్)

పలమనేరు: చిత్తూరు జిల్లాలోని పలమనేరు, కుప్పం ప్రాంతాలతోపాటు పొరుగునే ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో మైలేర్ల (ఎద్దుల పరుగుపందేలు) సందడి మొదలైంది. ఇక్కడ సంక్రాంతంటే ఈ మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రజలకు గుర్తొచ్చేది మైలేర్లే. ఈప్రాంతంలో జరిగే మైలేరు పండుగల్లో మొదటి బహుమతిగా లక్ష ఫస్ట్‌ప్రైజ్ కాగా ఆపై బహుమతులుంటున్నాయి. తమిళనాడులో అయితే లారీలు, కార్లు మొదటి బహుమతిగా అందజేస్తున్నారు. అసలు మైలేరు అనే పదం తమిళమే. ఈ ప్రాంతం రెండు రాష్ట్రాల నడుమ ఉండడంతో మిశ్రమ సంస్కృతితో ఈ ఎడ్ల పరుగు పందేలాను నిర్వహించడం ఆనవాయితీ. దీంతో పరుగు పందెంలో పాల్గొనే ఎడ్లకు అవసరమైన సన్నాహాలను అప్పుడే ప్రారంభించేశారు. ఏ గ్రామంలోనైతే పండుగెద్దు వుంటుందో ఆ వూరి పేరు ప్రఖ్యాతులే వేరు. ఎద్దును సంరక్షిస్తున్న రైతుకు భలే గౌరవం. ఆ గ్రామానికి చెందిన ఎద్దు గెలిచిందంటే ఇక ఆ వూరి వారిని పట్టేందుకు పగ్గాలుండవు.

పండగెద్దులా మజాకా...

పండుగ నెల మొదలైనప్పటి నుంచి ఎద్దుకు మంచి మేత పెట్టడం, వాటి కొమ్ములను జువ్వడం చేస్తుంటారు. ఇలా సిద్ధం చేసిన ఎడ్లను పరుగు పందేలకు తీసుకెళ్లే ముందు బాగా అలంకరిస్తారు. పోటీల్లో ఎద్దుపై యువకులు దెబ్బ వేసేందుకు ప్రయత్నిస్తారు కాబట్టి దానికి రక్షణగా బ్లేడులు కట్టిన పరదాలను అమరుస్తారు. ఈ ప్రాంతంలో మైలేర్లకు వెళ్లే ఎద్దులు మూడు వేల దాకా ఉన్నాయి.

మొదటి బహుమతిగా లారీలు, కార్లు

ఈ పోటీల్లో ప్రైజులు సైతం భారీగానే ఉంటాయి. తమిళనాడులోని కొన్ని చోట్ల మొదటి బహుమతిగా లారీలు, కార్లు, బుల్లెట్‌తోపాటు రూ. 50వేల నుంచి లక్ష దాకా ఉంటాయి. పోటీల్లో గెలుపొందిన ఎద్దును సంబంధిత గ్రామంలో మేళ తాళాల మధ్య ఊరేగింపుగా స్వాగతం పలుకుతారు.

మైలేర్లకు పేరొందిన ఊర్లు ఇవే..

ఈ ప్రాంతంలో మైలేరు పండుగను గొప్పగా జరుపుకొనే ఊర్లు చాలానే ఉన్నాయి. ఈ పోటీలను కనుమ పండుగ నుంచి ఏప్రిల్ వరకు నిర్వహిస్తారు. బైరెడ్డిపల్లె, బంగారుపాళ్యం, మండీపేట కోటూరు, చెత్తపెంట, కాబ్బల్లి, కెంచనబల్ల, రామకుప్పం, మిట్టూరు, శాంతిపురం, కెనమాకులపల్లె, మల్లానూరు, నాయినూరు, గొల్లచీమనపల్లె, ఉన్నాయి. అయితే ఎద్దుల పరుగుపందేలపై గత కొన్నేళ్లుగా నిషేధం అమలులో ఉంది. దీంతో ఏటా పోటీలు తగ్గుతున్నాయి. ఇక సరిహద్దులోని తమిళనాడులో బొరుగూర్, పర్చూరు, గుడియాత్తం, ఆంబూరు, నాట్రాంపల్లె, పేర్నంబట్, పల్లికొండ, వేలూరు, క్రిష్ణగిరి, సేలం, ధర్మపురి ప్రాంతాల్లో నిర్వహిస్తారు. కర్ణాటకలోని దూలపల్లెలో ఈ పోటీని ఘనంగా నిర్వహిస్తారు. అయితే స్థానికంగా పోలీసులు మైలేర్లకు అనుమతి ఇవ్వకపోవడంతో గతంలో ఉన్నంత హంగు, ఆర్భాటం కనిపించడం లేదు.



కోడెగిత్తను నిలువరించేందుకు యత్నిస్తున్న యువత

నేడు సామాజిక తనిఖీ

గంగవరం: మండలంలో ఉపాధి పనులకు సంబంధించి నేడు గురువారం 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి పథకం కింద 2023–2024వ సంవత్సరం మధ్య కాలంలో చేసిన పనులకు గతంలో జరిపిన సామాజిక తనిఖీలో బయటపడిన తప్పిదాలపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి ఉపాధి భవనం ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు. అదేవిధంగా ఇదేరోజు గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

శంకర్రాయలపేటలో ఫ్యామిలీ డాక్టర్



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట గ్రామంలో పెద్దపంజాణి పీహెచ్‌సీ వైద్యాధికారి మురళి బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు 104 మొబైల్ క్లినిక్‌లో పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాల విద్యానులకు పరీక్షలు నిర్వహించి పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ జమున, ఏఎన్‌ఎం సుశీల. ఆశా వర్కర్‌లు ఉమ, చాంద్‌బీ పాల్గొన్నారు.



GET TOGETHER

విశ్రాంత గురువులతో పూర్వవిద్యార్థులు

ఐదు దశాబ్దాల స్నేహ గీతం

పుంగనూరు: పూర్వవిద్యార్థులు బుధవారం ఒక చోట కలిసి తమ మధుర జ్ఞాపకాలను ఒకరినొకరు పంచుకున్న ఆత్మీయ సంఘటన బుధవారం జరిగింది. స్థానిక బసవరాజ కళాశాలలో 1975 సంవత్సరం చదివిన ఇంటర్ పూర్వవిద్యార్థులు సుమారు 100 మంది వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ముడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ , వ్యాపారవేత్త ముల్లంగి విజయ్‌కుమార్, సీనియర్ న్యాయవాది రామకృష్ణ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు సమావేశమై పాఠాలు బోధించిన విశ్రాంత గురువులు రాఘవులజెట్టి, చంద్రశేఖరాచారి, ద్వారకమ్మ, వెంకటసుబ్బయ్యకు పాదాభివందనం చేసి, ఘనంగా సన్మానించారు. విందు భోజనాలు , సెల్ఫీలు, గ్రూపు ఫొటోలు తీసుకుంటూ గత స్మృతులను తలచుకుంటూ సరదాగా గడిపారు. ఈ సందర్భంగా పట్టణంలో సేవా కార్యక్రమాలు చేసేందుకు నిర్ణయించారు. సమావేశంలో పూర్వవిద్యార్థులు చెన్నారెడ్డి, ఇక్బాల్, బాలసుబ్రహ్మణ్యం, సుబ్బరాయప్ప, కె.మోహన్ , మోహన్ , రామచంద్రారెడ్డి, కమలకుమారి, లీలావతి, రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమానికి ఆలయ, బ్యాంకు, పోలీసు సిబ్బంది విధిగా హాజరు కావాలని కోరారు.

వైద్యశిబిరం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ పవన్‌కుమార్

చౌడేపల్లె: మండల కేంద్రంలోని గడ్డంవారిపల్లెలోని ఎస్టీ కాలనీలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించినట్లు డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ బహుద్దీన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కోవిడ్ నిబంధనలపై అవగాహన కల్పించాలి



పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ సుధారాణి

బైరెడ్డిపల్లె: గ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది కోవిడ్ నిబంధనలపై పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి సూచించారు. బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని ఆన్‌లైన్ సేవలు, రికార్డులు, రిపోర్టులను పరిశీలించారు. పీహెచ్‌సీలోని ప్రసూతి, రక్తపరీక్షల గది, ఫార్మసీ, ఇంజక్షన్ గదులను తనిఖీ చేశారు. బాల్య వివాహాలను అరికట్టాలని, మాతా శిశు సంరక్షణ, సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆమెతో పాటు జిల్లా వైద్యాధికారులు శ్రీవాణి, గిరి, శ్రీనివాస్, బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ, యూటీఎఫ్ నేతలు

చౌడేపల్లె: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ప్రతి పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంపీడీఓ లీలామాధవి సూచించారు. బుధవారం స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో యూటీఎఫ్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలలో చదువుతున్న 400 మంది విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, హెచ్‌ఎం నాగరాజరెడ్డి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సహదేవ, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, లోకనాథరెడ్డి, సుధాకర్, ఈశ్వరయ్య, రమేష్, మునిరత్నం, బాబు రమేష్, మురళి, సోమశేఖర్, అమరనాథ్, వెంకటరమణ ఉన్నారు.

అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న హాస్టల్ విద్యార్థినులు



భోగి మంటలు వేస్తున్న వార్డెన్, విద్యార్థినులు

వి.కోట: మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా చేసుకునే సంక్రాతి సంబరాలు స్థానిక బీసీ బాలికల పాఠశాలలో అంబరాన్నంటాయి. బుధవారం హాస్టల్ వార్డెన్ ఉమాదేవి ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. దీంతో హాస్టల్ మొత్తం నూతన శోభ సంతరించుకుంది. మామిడాకుల తోరణాలు, చెరకు గడులు, పూల దండలు, గాలిపటాలు రంగవల్లికలు, భోగిమంటలు, పొంగల్లు చేయడం వంటి వాటిపై పిల్లలకు అవగాహన కల్పించడంతో పాటు ఘనంగా సంక్రాంతి సంబరాలు చేసుకోవడంతో సంక్రాతి కళ ఉట్టిపడింది. అనంతరం విద్యార్థులకు రంగవల్లికల పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు.

వ్యక్తి అదృశ్యం

గంగవరం: మండలంలోని మేలుమాయి పంచాయతీ గుండ్లపల్లి గ్రామానికి చెందిన మదన్‌మోహన్‌రెడ్డి వారం రోజులుగా కనిపించడంలేదని కుటుంబసభ్యులు బుధవారం తెలిపారు. ఇతనికి ఎలాంటి మతిస్థిమితం లేదని, కానీ కొంత అనారోగ్య కారణాలతో ఇంటి నుంచి వెళ్లాడని, ఇప్పటి వరకూ తిరిగి రాలేదన్నారు. అన్ని చోట్ల గాలించినా అతని ఆచూకీ లభించలేదన్నారు. 45 ఏళ్లు కలిగి బ్లూ కలర్ లుంగీ, లైట్ పర్పుల్ కలర్ షర్ట్, వైట్ కలర్ చెప్పులు ధరించాడని తెలిపారు. ఇతని ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తి అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఆ చూకీ తెలపడానికి 9535251801, 9381346907 నంబర్లలో సంప్రదించాలన్నారు.

తిరుమల కొండయ్యపల్లిలో జల్లికట్టు

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలం తిరుమలకొండయ్యపల్లెలో బుధవారం జల్లికట్టు నిర్వహించారు. గోమాతకు ప్రత్యేక పూజలు చేసి ఈ జల్లికట్టును ప్రారంభించారు. అనంతరం ఎద్దులను పరుగులు పెట్టించారు. వాటిని నిలువరించేందుకు యువకులు, పెద్దలు పోటీలు పడ్డారు. ఇందులో నెగ్గిన వాటికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ జల్లికట్టును తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి గ్రామస్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

టీచర్లకు క్యాలెండర్ల పంపిణీ

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని నగరపాలక పాఠశాలల టీచర్లకు పీఆర్‌టీయూ నూతన సంవత్సరం క్యాలెండర్‌లు, డైరీలు అందజేసినట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం నగరంలోని కట్టమంచి, గిరింపేట, కొంగారెడ్డిపల్లి, సంతపేటలో ఉన్న నగర పాలక ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో క్యాలెండర్లు, డైరీలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలున్నా తమ సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి కణ్ణన్, నగరపాలక పాఠశాలల టీచర్లు పాల్గొన్నారు.

ఒత్తిళ్లకు ఇద్దరు అధికారుల బలి

- కుప్పం, రామకుప్పం ఎంపీడీఓ స్థానాలు ఖాళీ
- ఉన్నత చదువులా..? అధికార పార్టీ నేతల ఒత్తిళ్లా..?



కుప్పం మండల పరిషత్ కార్యాలయం

కుప్పం: విధి నిర్వహణలో చేరి ఐదు నెలలు గడవకముందే ఇద్దరు మండల స్థాయి అధికారులు టీడీపీ నేతల ఒత్తిళ్లకు బలైపోయారు. దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడంతో కుప్పం నియోజకవర్గంలోని కుప్పం, రామకుప్పం మండలాల మండల పరిషత్ అధికారుల స్థానాలు ఖాళీలయ్యాయి. వీరిద్దరు ఉన్నత చదువుల కోసం సెలవుపై వెళ్లారని కొందరు.. అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల తట్టుకోలేక దీర్ఘకాలిక సెలవులు పెట్టారని మరికొందరు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ఒకేసారి ఇద్దరు ఎంపీడీఓ స్థానాలు ఖాళీ కావడంతో మండలాల అభివృద్ధి పనులు కుంటుపడుతోందని స్థానికులు అంటున్నారు. కుప్పం మండల పరిషత్ అధికారి సాయి లహరి ఆగస్టు నెలలో బాధ్యతలు స్వీకరించారు. గడిచిన నాలుగు నెలల్లో మండల పరిషత్ కార్యాలయాన్ని రూ.25 లక్షల వ్యయంతో రూపురేఖలు మార్చి ఆధునీకరించారు. దీంతో పాటు ప్రత్యేకంగా వర్చువల్ ఇంటరాక్టివ్ ఏరియా అంటూ ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. దీంతో పాటు సమావేశ గది, ఇతరత్రా పనుల నిమిత్తం రూ.20 లక్షలకు పైగా వెచ్చించినట్లు సమాచారం. ఈ విషయంపై స్థానికంగా ఉన్న అధికార పార్టీ నేతలకు ఎంపీడీఓకు మధ్య విభేదాలు తలెత్తాయి. మండలస్థాయి అధికార నేతలతోపాటు నియోజకవర్గ స్థాయి ప్రధాన నాయకుడికి ఎంపీడీఓ మధ్య తలెత్తిన వివాదం ఆమెను బలి తీసుకుందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పాటు రామకుప్పం ఎంపీడీఓ లక్ష్మీకాంత్ సైతం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. నాలుగు నెలల పాటు రామకుప్పం మండలంలో అధికార పార్టీ నేతలు చెప్పిన మాట ప్రకారం కాకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకున్నందుకు ఆయన్ని బలి చేశారని స్థానికులు అంటున్నారు. ఇద్దరు ఎంపీడీఓలు ఆగస్టు నెలలో అధికార పార్టీ నేతలే ప్రత్యేకంగా కుప్పానికి ఆహ్వానించారు. నాలుగు నెలల్లో వారిద్దరినీ అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో మళ్లీ వెనక్కి పంపేశారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇన్‌చార్జ్‌ల నియామకం

కుప్పం ఎంపీడీఓగా సాయిలహరి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో ఈఓపీఆర్డీ విజయ్‌దత్‌ను నియమించారు. రామకుప్పం మండల అభివృద్ధి ఇన్‌చార్జ్ అధికారిని నియమించాల్సి వుంది.